క్లుప్తంగా

వైభవంగా అలుగు ఉత్సవం



అలుగును ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

నగరి : మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో నిర్వహిస్తున్న ద్రౌపదమ్మ తిరునాళ్లలో భాగంగా శుక్రవారం అలుగు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ ఆధ్వర్యంలో పసుపు వస్త్రాలు ధరించిన భక్తులు అలుగు కుండను తలపై ఉంచుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలోని ద్రౌపదమ్మ విగ్రహం సమీపం అలుగును ఉంచారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు గుమిగూడారు. అలుగుతో పాటు ప్రత్యేక అలంకరణలో ఉన్న ద్రౌపదీ, ధర్మరాజ స్వాములను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయం వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు డివిజన్‌లో విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. 33, 11 కేవీల లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఎం.ఎస్.ఆర్ కూడలి, రాజీవ్‌గాంధీవీధి, కొండమిట్ట, లాలూగార్డెన్, మిట్టూరు, నాయుడు బిల్డింగ్స్, సీబీరోడ్డు, సంతపేట, తోటపాళ్యం, చవటపల్లె, ఇందిరానగర్, కైలాసపురం, మున్సిపాల్‌కాలనీ, దుర్గమ్మగుడివీధి, బాలాజీనగర్, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, ఎస్టేట్, బస్టాండ్, బీవీరెడ్డికాలనీలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. జీడీనెల్లూరు, పాలసముద్రం, గుడిపాల, పూతలపట్టు, పెనుమూరు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం : గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా మాతాశిశు మరణాలను తగ్గించవచ్చని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. అనంతరం 35 మంది గర్భిణులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు

నగరి: నగరి – పుత్తూరు మార్గంలోని అన్నాగౌరీ హాస్పిటల్ వారు పట్టణ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన ఆస్పత్రి డీన్ డాక్టర్ అనురాధ, ఆర్ఎంయూ రవితేజ, డైరెక్టర్ సుధాకర్ రెడ్డి వైద్య పరీక్షలను ప్రారంభించారు. చిన్నపిల్లల వైద్యులు బ్రాహ్మిణి, జగదీష్, శరత్‌బాబు, మహేశ్వరి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ భారతి తెలిపారు. స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసు కంట్రోల్ నంబర్ 100, చైల్డ్ లైన్ నంబర్ 1098కు డయల్ చేయాలన్నారు.

సేంద్రియ సేద్యం.. పంటకు సారం

రసాయనిక ఎరువులు వినియోగంతో భూమి సారం కోల్పోతుంది. భూమిలో ఉండే మిత్ర పురుగులు చనిపోతాయి. చీడపీడలు కూడా ఎక్కువగా విజృంభిస్తాయి. సేంద్రియ ఎరువుల వాడకంతో భూమి సారం, నేల ఉత్పాదక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తాయి. రైతులకు వ్యవసాయంలో ఖర్చులు తగ్గుతాయి. అధిక దిగుబడులు వచ్చి లాభాలు పొందే అవకాశం ఉంటుంది. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని డీపీఎం వాసు తెలిపారు.



సేంద్రియ పద్ధతుల్లో సాగులో ఉన్న వరిపంట

- ప్రకృతి వ్యవసాయంలో ఖర్చులు ఆదా
- ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు
- రసాయనిక ఎరువులతో భూమికి నష్టం

పాలసముద్రం : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఎక్కువ మంది వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా పంటల దిగుబడి ఎక్కువగా రావాలనే ఉద్దేశంతో రసాయనిక ఎరువులు వాడుతున్నారు. దీనివల్ల భూసారం తగ్గి నేల ఉత్పాదక శక్తి తగ్గిపోతుంది. వ్యవసాయ సాగు ఖర్చులు కూడా పెరుగుతాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ పద్ధతిపై రైతులు అవగాహన కల్పిస్తోంది. దీనివల్ల భూమి సారం పెరగడంతో ఉత్పాదక శక్తి పెరుగుతంది. ఆరోగ్యకరమైన పంట దిగుబడులు వస్తాయి. జిల్లాలో 5185 మంది రైతులు 53,799 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీరిలో 3485 మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపారు. వారు ప్రస్తుతం 31,660.53 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. నీరు సమృద్ధిగా లభించే రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను అనుసరిస్తూ ఆశించిన మేర దిగుబడులు సాధిస్తున్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

- నేల, నీరు, వ్యవసాయ ఉత్పత్తులు కాలుష్యానికి గురికావు. సేంద్రియ ఎరువుల వినియోగం పెరగడం వల్ల మొక్కకు అవసరమైన ఉప సూక్ష్మపోషకాలు తగిన మోతాదుల్లో లభ్యమవుతాయి. చీడపీడల తాకిడి తగ్గుతుంది. ఆరోగ్యానికి, కాలుష్య నివారణకు దోహదపడుతుంది. నేలకు నీరు ఎక్కువగా పట్టి ఉంచుకునే శక్తి పెరుగుతుంది. మొక్క వేర్లు బాగా భూమిలోకి చొచ్చుకుని పోయే లక్షణం కలిగి ఉంటుంది. భౌతిక లక్షణాలు వృద్ధి చెందుతాయి. మొక్కకు పోషకాలు బాగా అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయ సుస్థిరత పెరుగుతుంది. సురక్షిత ఆహారం లభిస్తుంది.
- ఆహారంలోకి విష పదార్థాలు ప్రవేశించే అవకాశం ఉండదు. పెట్టుబడులు తగ్గుతాయి. నేల ఉత్పాదకత, భూసారం పెరుగుతాయి. పంటలో నాణ్యత పెరుగుతుంది.

యాజమాన్య పద్ధతులు

- సేంద్రియ వ్యవసాయానికి గోవుల పేడ, వేపసారం అవసరం. నేల కోతకు గురికాకుండా జాగ్రత్త పడాలి. నేల– నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలి. అనువైన అంతర పంటలు వేయాలి. పచ్చిరొట్ట పైర్లకు, పచ్చి ఆకు రొట్టకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా ఉపయోగించడం కీలకం.
- పూర్తిగా కుళ్లిన సేంద్రియ ఎరువుల వాడకం, పరిశుభ్రమైన సాగు, సకాలంలో కలుపు నివారణ చేయాలి. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు విరివిగా వాడడం ముఖ్యం. సాగునీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాలి. రసాయనాలు వాడకుండా సహజ వనరుల ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవాలి. జీవ నియంత్రణ పద్ధతులు, వృక్ష సంబంధ మందులకు ప్రాధాన్యం ఇవ్వాలి.



కషాయం తయారు చేస్తున్న మహిళా రైతులు

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

రసాయన ఎరువులతో భూమి సారం తగ్గిపోతుంది. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి. పంట మార్పిడితో రైతులకు ఆర్థిక దన్ను కలుగుతుంది. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు పురుగు మందులు వాడాలి. అప్పుడే భూమి సారం కోల్పోకుండా ఉంటుంది. ఖర్చులు తగ్గాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలి,

– డీపీఎం వాసు



ఘన జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎంతో ఉపయోగం



సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రసాయనిక ఎరువుల వాడకంతో భూమి సారం కోల్పోతుంది. దీనివల్ల దిగుబడి కూడా తగ్గిపోతుంది. కొన్నిసార్లు కనీసం పెట్టుబడి కూడా రాదు. అందువల్ల తక్కువ పెట్టుబడితో సాధ్యమయ్యే సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాం. మంచి దిగుబడులు వస్తున్నాయి. ఖర్చులు కూడా తగ్గాయి.

– గాలి మహేష్ బాబు, శ్రీకావేరిరాజుపురం

సాగు ఖర్చు తక్కువ

సేంద్రియ వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గాయి. పంట కాలం నాలుగు మాసాలు ఉంటుంది. ఎకరాకు వరి మూడు పుట్ల దిగుబడి వస్తుంది. రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు ఖర్చు అవుతుంది. అదే రసాయన ఎరువులు వినియోగిస్తే రూ.40 వేలు అవుతుంది. ఖర్చు ఎక్కువ అవుతుండడంతో సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాం.

– కేశవన్, చెరుముందర కండ్రిగ,

వేరుశనగ సాగులో మెలకువలు అవసరం

పాలసముద్రం : రైతులు వేరుశనగ సాగులో మెళకువలు పాటించాలని డీఆర్‌సీ– డీటీసీ సహాయ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మని తెలిపారు. శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఏవో ఢిల్లీప్రసాద్ సమక్షంలో రైతులకు వేరుశనగ, చెరకు పంటలకు ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అపరాలతో పంట మార్పిడి చేయాలని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటే పంట అధిక దిగుబడి ఎక్కువగా సాధించవచ్చని తెలిపారు. వేరుశనగ కోత, నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కత్తెర పురుగు యజమాన్యంపై వివరించారు. బిందు సేద్యంలో చెరకు, డ్రమ్ సీడర్ పద్ధతిలో వరిని సాగు చేసుకోవాలని సూచించారు.

సంపద సృష్టిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



చెత్త సేకరణ కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం : చెత్త నుంచి సంపద సృష్టిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం రెండో రోజూ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ఎంవోటీ పురుషోత్తం, శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. అనంతరం శ్రీకావేరిరాజుపురం చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరుతుందన్నారు. అలాగే చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని తెలిపారు. మండల విస్తరణాధికారి రమేష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ రక్షణ



మొక్కలు నాటుతున్న అధికారులు

నగరి : మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ ఏర్పడుతుందని జాతీయ రహదారి అధికారులు తెలిపారు. మున్సిపల్ పరిధి సత్రవాడ సమీపంలో శుక్రవారం విద్యార్థులతో కలిసి జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటారు. మేనేజర్ కన్నప్ప మాట్లాడుతూ మొక్కల పెంపకం వలన కలిగే లాభాలను విద్యార్థులకు తెలియజేశారు.

కార్వేటినగరం సీఐగా హనుమంతప్ప



కార్వేటినగరం: కార్వేటినగరం సీఐగా ఎస్.హనుమంతప్ప శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడానికి సిబ్బంది కృషి చేయాలిన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఆయనకు సిబ్బంది శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వర్లు

పుత్తూరు: పుత్తూరు తహసీల్దార్‌గా జి.సి.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి రూరల్ రామచంద్రాపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసగౌడ్ నంద్యాలకు బదిలీపై వెళ్లారు.

పాలసముద్రం తహసీల్దార్ అరుణకుమారికి సన్మానం

పాలసముద్రం : బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ అరుణ కుమారిని శుక్రవారం జెడ్పీటీసీ అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, మహేష్, అయ్యప్ప, లిల్లీ, అనురేఖ, జీవిత, సీఖ, నరసింహరాజు, ఎంపీడీవో గోవిందరాజులు, నాయకులు సుబ్రమణ్యరెడ్డి, సుందరరాజు, షణ్ముగరెడ్డి, వరదరాజు, లోకిదాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పటిష్టతకు కృషి



డీఎస్పీ రవికుమార్

పుత్తూరు: పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పటిష్టతకు కృషి చేయనున్నట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా పనిచేస్తున్న రవికుమార్ శుక్రవారం పుత్తూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గంజాయి, నాటు సారా, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి శాంతి భద్రతలను మెరుగు పరుస్తానని స్పష్టం చేశారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయనున్నట్లు వెల్లడించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు హైవే రహదారుల్లో నిఘా వ్యవస్థను పటిష్ట పరచనున్నట్లు తెలిపారు. పుత్తూరు పట్టణంలో కళాశాలలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులే లక్ష్యంగా చేసుకుని గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. దీనిని పూర్తి స్థాయిలో అరికట్టనున్నట్లు చెప్పారు. కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పట్టణంలో తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా మెలగాలని సూచించారు. గ్రామాల్లో ఎస్.హెచ్.ఓల ద్వారా తరచూ గ్రామసభలు నిర్వహించి గ్రూపు తగాదాలను అదుపు చేస్తామన్నారు. పుత్తూరులో ప్రారంభమైన ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వెంకటమోహన్ పాల్గొన్నారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావు తిరుపతికి బదిలీ అయ్యారు.

ఆలయాల్లో వైభవంగా ఆడి పూజలు



వేంబళగి అమ్మన్ ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

నగరి : పట్టణ పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో ఆడి శుక్రవారం పూజలు వైభవంగా నిర్వహించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో ఈ పూజలను పురస్కరించుకొని భక్తులు పీసీఎస్ ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి పాల కలశాలతో ఊరేగింపుగా వచ్చారు. మాజీ అడిషనల్ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ పాలేగారు కోసలరాం ముఖ్య అతిథిగా హాజరై ఈ ఊరేగింపును ప్రారంభించారు. ఎరుపు దుస్తులు ధరించిన భక్తులు 354 మంది గంజిని ఊరేగింపుగా ఓంశక్తి ఆలయం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గెరిగనాట్యాల నడుమ తీసుకెళ్లడం ప్రత్యేకతను సంతరించుకుంది. నెత్తం కండ్రిగ కొండగప్పై ఉన్న వేంబళిగి అమ్మవారికి ఆడి శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు పాల కుండలతో ఊరేగింపుగా వెళ్లి పాలాభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు బాబు పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు.

ద్రౌపదీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ దేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మొక్కులున్న భక్తులు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

మహేష్ జన్మదిన వేడుకలు

గంగాధర నెల్లూరు : సినీనటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం గంగాధర నెల్లూరు మండలంలో మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లోకనాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గంగాధర్ నెల్లూరు పంచాయతీలోని అక్కనగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం లోకనాథం ఆధ్వర్యంలో కేకు కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాధరం, మహేష్‌బాబు ఫ్యాన్స్ మోహన్, వినాయకం తదితరులు పాల్గొన్నారు.

మహారాజపురంలో తమిళనాడు వాసి మృతి

విజయపురం : మండలంలోని మహారాజపురం సమీపంలో మూడు రోజుల క్రితం తమిళనాడుకు చెందిన పి భాస్కరన్ (53) మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసు కథనం మేరకు, తమిళనాడులోని తిరుళ్లూరు జిల్లా తామరపాకానికి చెందిన భాస్కరన్ అక్కడ విద్యుత్ శాఖలో పని చేస్తున్నారు. ఈయన మూడు రోజుల క్రితం తన భార్య ఊరు కావరాజపురం వచ్చాడు. తాను కనకమ్మ సత్రం వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. ఆ తరువాత మూడు రోజులైనా ఇంటికి రాకపోవడంతో బంధువులు చుట్టు పక్కల వెతుకుతుండగా మహరాజపురంలో ఉన్న బ్రాందీషాపు వెనుక తన మృతదేహాన్ని కనుగొన్నారు. వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ జయప్ప తన సిబ్బందితో అక్కడికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం భార్య ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టు నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వీఆర్వో మృతి



గుణశేఖర్ (ఫైల్)

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం కలిజవేడు పంచాయతీ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న గుణశేఖర్(56) శుక్రవారం తెల్లవారుజామున వీరకనెల్లూరు దళితవాడలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. గుణశేఖర్ భౌతిక దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం





గంగాధర నెల్లూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు, శ్రీరంగరాజపురం: అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

గంగాధర నెల్లూరు : విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడిని వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. వారు శుక్రవారం జీడీ నెల్లూరులో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం, సర్పంచులు ఆబు, గోవిందన్, నేతలు వెంకటేష్ రెడ్డి, వేల్మూరు కుట్టి, కడప గుంట పుష్పరాజ్, యేసు, అలీ షేర్‌ఖాన్, జగదీష్ బాబు, విష్ణు, వరప్రసాద్ పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

శ్రీరంగరాజపురం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణి తెలిపారు. ఆయన శుక్రవారం శ్రీరంగరాజపురంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ప్రపంచంలోనే అతి ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. దానిపై గురువారం రాత్రి టీడీపీ మూకలు పోలీసుల సమక్షంలోనే దాడి చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని ఆరోపించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ రమణ ప్రసాద్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, దళిత నాయకులు మహేష్, ఏకాంబరం, రామకృష్ణ, ముత్తుగన్, బాబు, ప్రమీల, రామకృష్ణ యాదవ్, ఆనంద్, జయ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సార్ పురంలో నిరసన

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి దారుణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మణి తెలిపారు. దీన్ని నిరసిస్తూ శనివారం ఉదయం గంగాధరనెల్లూరు నియోజకవర్గ స్థాయిలో శ్రీరంగరాజపురం(ఎస్సార్‌పురం)లో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, శాంతియుతంగా నిరసన తెలుపుతామన్నారు. ఇందులో ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మేధావులు, సంఘ సంస్కర్తలు, దళిత సంఘాల నేతలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.